నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 27 డిసెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్ రాజకీయ కక్షే : నగేశ్

బీబీనగర్, డిసెంబర్ 26 : ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్ ముమ్మాటికీ రాజకీయ కక్షేనని బీఆర్ఎస్‌వీ యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కి నగేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం పేరుతో రాష్ట్రాన్ని రావణ కాష్ఠం చేస్తున్న రేవంత్ రెడ్డి ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని పేర్కొన్నారు. రేవంత్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూ ప్రజలతో పాటు దళిత, గిరిజన సోదరులకు అండగా ఉంటున్నందుకు శ్రీనివాస్‌పై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం పథకాల అమలుపై దృష్టి పెట్టకుండా బీఆర్ఎస్ నాయకులను అరెస్టులు చేయడం సిగ్గుచేటని తెలిపారు. రేవంత్ కక్షపూరిత చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

దొంగ నోట్ల కలకలం

చౌటుప్పల్, డిసెంబర్ 26 : చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రాల్లో దొంగ నోట్ల చలామణి కలకలం రేపుతున్నాయి. ఇటీవల చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని సంత, ఓ వైన్స్ దుకాణంలో రూ.500 రెండు దొంగ నోట్లు వచ్చినట్లు సంబంధిత వ్యాపారులు పోలీసుల దృష్టికి తెచ్చారు. దీంతో వాటి చలామణి తమ దృష్టికి వచ్చినట్లు ఏసీపీ పి.మధుసూదన్‌రెడ్డి గురువారం తెలిపారు. వాటిపై దృష్టి సారించినట్లు ఆయన పేర్కొన్నారు. వీటి చలామణి చట్టరీత్యా నేరమని, ఎవరికైనా అనుమానం వస్తే 100 నంబర్‌కు డయల్ లేదా స్థానికుల పోలీసుల దృష్టికి తేవాలని ఆయన సూచించారు.

కలెక్టర్ కార్యాలయం ఎదుట ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలియజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

తీన్మార్ మల్లన్న తీరు విచారకరం

- సమగ్ర శిక్ష ఉద్యోగులపై బురదజల్లే ప్రయత్నం విరమించుకోవాలి
- 17వ రోజు ఒంటి కాలిపై నిరసన తెలిపిన ఉద్యోగులు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 26 : న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా చేస్తున్న తమ సమ్మెపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బురదజల్లే ప్రయత్నం చేస్తున్న తీరు విచారకరమని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు మండిపడ్డారు. క్యూ న్యూస్ చానల్‌లో న్యూస్ రీడర్‌గా ఉన్న మల్లన్న సమగ్ర శిక్ష ఉద్యోగులతో పీఏఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘమే సమ్మె చేయిస్తుందని పేర్కొనడం దురదృష్టకరమన్నారు. గుర్తు తెలియని వ్యక్తి సెల్‌ఫోన్‌లో పంపిన సమాచారాన్ని న్యూస్‌లో చదువడం అత్యంత హేయమైన చర్య అని తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు రెగ్యులరైజ్ చేయాలని చేస్తున్న సమ్మెలో అన్ని ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలుపుతున్నాయని, అధికార పార్టీ, ప్రభుత్వం మల్లన్నతో ఇలాంటి వ్యాఖ్యలు చేయిస్తున్నదని వారు ఆరోపించారు. ఏది ఏమైనప్పటికీ తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగితే సంతోషకరమన్నారు. సమ్మెలో భాగంగా గురువారం 17వ రోజు ఉద్యోగులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, కవిత, నాయకులు ఆముదాల సునీత, శ్రావణ్, కృష్ణ, యాకయ్య, చైతన్య, కవిత, మోహనచారి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలకు ఇందిరమ్మ ఇండ్ల పరేషాన..!

ఇండ్ల కోసం హస్తం కార్యకర్తలు, జనం ప్రదక్షిణలు

- ఎట్లయినా తుది జాబితాలో పేరుండాలని విజ్ఞప్తులు
- నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మాత్రమే..
- ఎవరికి ఇచ్చినా..? ఇవ్వకపోయినా..? వ్యతిరేకతే..!
- వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్ర ఎఫెక్ట్
- గెలుపోటములపై ప్రభావం పడుతుందని లీడర్ల టెన్షన్
- తలలు పట్టుకుంటున్న ఆశావహ నేతలు
- పైరవీల కోసం ఎంపీ, ఎమ్మెల్యేల వద్దకు క్యూ

కాంగ్రెస్ నేతలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు టెన్షన్ పట్టుకున్నది. అరకొర ఇండ్ల మంజూరుతో ఎవరికి ఇవ్వాలో..? ఎవరికి ఇవ్వద్దో..? అని ఆందోళన రేకెత్తిస్తున్నది. వచ్చేవి స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో ఏం చేయాలో తెలియక నేతలు తలలు పట్టుకుంటున్నారు. నిత్యం పెద్ద సంఖ్యలో జనం వారి చుట్టూ తిరుగుతుండడంతో సమాధానం చెప్పలేక హైరానా అవుతున్నారు.

– యాదాద్రి భువనగిరి డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ)

నమస్తే అన్న.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకున్నా చేయి గుర్తుకే జై కొట్టినం. మొన్నటి అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే ఓటేసినం. వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కే వేస్తాం. మాకు ఇల్లు లేదు. ఎట్లయినా మాకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలి.

సార్.. ఎన్నికల్లో మీ గెలుపు కోసం ఎంతో కష్టపడిన. మా ఇంటిల్లిపాది ఓట్లు వేయడం కాకుండా.. చుట్టపోళ్లు, ఊరోళ్లతో ఓట్లు వేయించిన. ఇప్పుడు మీరే దిక్కు. అంతా మీదే దయ. ఎట్లయినా చేయండి.. ఒక్క ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించండి. పుణ్యం కట్టుకోండి..

ఇవీ.. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం కాంగ్రెస్ నేతల చుట్టూ తిరుగుతూ చేస్తున్న విజ్ఞప్తులు..

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. తొలి విడతలో సొంత స్థలం ఉన్న వారికి ఇండ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షల సాయం చేస్తామని ప్రకటించింది. ఒక్కో నియోజకవర్గానికి 3,500 మంది లబ్ధిదారులను గుర్తించనుంది. గతేడాది డిసెంబర్‌లో ప్రజా పాలనలో భాగంగా వివిధ పథకాల అమలు కోసం దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 2,01,977 అప్లికేషన్లు వచ్చాయి. వారిలో అర్హులను గుర్తించేందుకు ప్రస్తుతం సర్వే నిర్వహిస్తున్నారు. జిల్లాలో 421 గ్రామ పంచాయతీలతోపాటు మున్సిపాలిటీల్లో 104 వార్డుల్లో సర్వే నడుస్తున్నది. సాంకేతిక కారణాలతో సర్వే నత్తనడకన సాగుతున్నది.

నేతల చుట్టూ జనం ప్రదక్షిణలు..

ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం లబ్ధిదారుల జాబితాను ప్రకటిస్తే.. పనులు ప్రారంభించేందుకు రెడీగా ఉన్నారు. ప్రభుత్వం ఒక్కో ఇల్లుకు రూ.5 లక్షలు ఇవ్వనుండగా.. మరికొన్ని డబ్బులు కలిపి ఇల్లు కట్టుకోవాలని చాలామంది నిరీక్షిస్తున్నారు. సర్వే తర్వాత లబ్ధిదారుల జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. దీంతో గ్రామాలు, పట్టణాల్లో కాంగ్రెస్ నాయకుల ఇండ్లు జనంతో కిటకిటలాడుతున్నాయి. ఇండ్ల కోసం ఎదురుచూసేవారు కాంగ్రెస్ లీడర్ల చుట్టూ తిరుగుతున్నారు. నిత్యం ఫోన్లు, మెసేజ్‌లు చేస్తూ గుర్తు చేస్తున్నారు. నేతలు ఎక్కడ కలిసినా ఇదే ప్రస్తావన తీసుకొస్తున్నారు. ఎట్లయినా తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నేతలపై ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో కొందరు నేతలు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. జనం, కార్యకర్తలు నొచ్చుకోకుండా సమాధానం ఇస్తున్నారు. మరోవైపు స్థానిక నేతలు సైతం ఎమ్మెల్యేలను కలుస్తూ.. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో తమవారికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

స్థానిక ఎన్నికలపై ప్రభావం..?

కొన్ని రోజుల్లో స్థానిక సంస్థల సమరం షురూ కానుంది. సర్పంచ్, పరిషత్, మున్సిపల్ ఎన్నికలు రానున్నాయి. దీంతో ఇందిరమ్మ ఇండ్ల ప్రభావం వచ్చే ఎన్నికల్లో పడే అవకాశం ఉంది. ప్రధానంగా గ్రామాల్లో సర్పంచ్, వార్డు, మున్సిపాలిటీల్లో కౌన్సిలర్‌గా పోటీలో నిలబడే వారికి ఎఫెక్ట్ పడే ఛాన్స్ లేకపోలేదు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మాత్రమే కావడంతో ఒక్కో ఊరికి 20 ఇండ్ల లోపే రానున్నాయి. ఆయా చోట్ల తమ అనుకున్న వారికి మంజూరు చేస్తే.. మిగతా వారంతా వ్యతిరేకయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇండ్లు మంజూరు చేయించుకున్నోళ్లే ఓటర్లా.. తాము కాదా అనే చిక్కులు ఉత్పన్నం కానున్నాయి. ఫలితంగా ఎన్నికల్లో గెలుపోటములు తారుమారుకు ఆస్కారం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ నరహరి

అతిథి గృహమా.. కాంగ్రెస్ కార్యాలయమా..?

- కాంగ్రెస్ కార్యకర్తలా వ్యవహరిస్తున్న ఈఓ భాస్కర్‌రావు
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నేతలు రవీందర్ గౌడ్, నరహరి

యాదగిరిగుట్ట, డిసెంబర్ 26 : దైవ దర్శనానికి వచ్చే వీవీఐపీల కోసం యాదగిరిగుట్ట కొండపైన నిర్మించిన అతిథి గృహాలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లా మారాయని ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ నరహరి ఆరోపించారు. గురువారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వీవీఐపీ అతిథి గృహంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తన అనుచరులతో కలిసి రాత్రి బస చేయడం ఆలయ నిబంధనలకు పూర్తిగా విరుద్ధమన్నారు. ఆలయ ఈఓ భాస్కర్‌రావు పూర్తిగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని, అయన తీరు భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని మండిపడ్డారు. స్వాతి నక్షత్రం సందర్భంగా చేసే గిరిప్రదక్షిణ వందల ఏండ్లుగా ఉదయం 3 గంటల్లోపే వైకుంఠ ద్వారం వద్ద నుంచి చేస్తారన్నారు. కానీ ఈఓ భాస్కర్‌రావు మాత్రం ఇందుకు భిన్నంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వచ్చే వరకు గిరిప్రదక్షిణ ప్రారంభించడం లేదని విమర్శించారు. స్వామివారి సేవలను ప్రజాప్రతినిధులు వచ్చి మార్చడమేంటని మండిపడ్డారు. ఈఓ భాస్కర్‌రావు ఆలయ నియమాలను పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామివారి గర్భాలయ దర్శనానికి ప్రతి భక్తుడు సంప్రదాయ దుస్తులు ధరించి వెళ్లాల్సి ఉండగా.. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అతడి అనుచరులు ఇందుకు విరుద్ధంగా ప్యాంట్లు, సెల్‌ఫోన్‌లతో గర్భాలయ దర్శనానికి వెళ్లారని ఆరోపించారు. ఇదంతా ఈఓ చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఎంపీ చామల వివేరా హోటల్‌లో బస చేశామని మాట మారుస్తున్నారని మండి పడ్డారు. ఒకవేళ ఎంపీ వీవీఐపీ గెస్ట్ హౌస్‌లో బస చేయలేదన్నది నిజమైతే సీసీ కెమెరాలను పరిశీలిస్తే స్పష్టమవుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ నాయకులు ఆరే శ్రీధర్, పేరబోయిన సత్యనారాయణ, ఆవుల సాయి, షేక్ దావూద్, ఎండీ యాకూబ్ పాల్గొన్నారు.

భువనగిరి మదర్ డెయిరీలో అక్రమాలు

ఆవు పాలకు బదులు బర్రె పాల బిల్లులు

- రోజుకు 400 లీటర్ల గోల్‌మాల్
- నెలకు రూ.2లక్షలు కాజేసిన మేనేజర్
- మరికొందరి భాగస్వామ్యంతో మోసం
- మేనేజర్‌తోపాటు మరో ఐదుగురిపై సస్పెన్షన్ వేటు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 26 : భువనగిరి పట్టణ పరిధి రైల్వే స్టేషన్ సమీపంలో గల మిల్క్ చిల్లింగ్ సెంటర్‌లో కొన్ని రోజుల నుంచి అక్రమాలు గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నాయి. మిల్క్ సెంటర్ మేనేజర్ ఆవు పాలకు బదులుగా బర్రె పాలకు బిల్లు పెట్టి నెలకు రూ.2లక్షలు స్వాహా చేస్తున్నాడు. ప్రతి రోజూ ఉదయం, రాత్రి వచ్చిన పాలకు వేర్వేరుగా వచ్చిన వెన్నశాతం ప్రకారం ధర నిర్ణయించి పాడి రైతులకు చెల్లింపులు చేస్తారు. ఈ క్రమంలో గ్రామాల్లో సేకరించిన ఆవుపాలకు బదులుగా బర్రె పాలుగా చూపించారు. పట్టణంలోని మిల్క్ చిల్లింగ్ సెంటర్‌లో అక్రమాలకు పాల్పడిన మేనేజర్‌తో పాటు మరో ఐదుగురిపై సస్పెన్షన్ వేటు వేశారు.

రైతులకు ఆవు పాల ధర.. మదర్ డెయిరీ నుంచి బర్రె పాల ధర వసూలు

భువనగిరిలోని మదర్ డెయిరీలో నిబంధనల ప్రకారం ఉదయం పాలకు, రాత్రి పాలకు వేర్వేరుగా వెన్న తీసి దానికి వేర్వేరుగా వెన్న శాతాన్ని లెక్కిస్తారు. అందులో నుంచి వచ్చిన వెన్నశాతం ప్రకారమే పాల ధర నిర్ణయించి ఉదయం పూట వచ్చే ఆవు పాలకు రూ.38, రాత్రి వచ్చే పాలకు రూ.36 పాడి రైతులకు చెల్లిస్తారు. బర్రె పాలకు ఉదయం రూ.57, రాత్రి పాలకు రూ.52 చొప్పున చెల్లిస్తారు. ఈ క్రమంలో ఎంబావి గ్రామంలోని పాల సెంటర్ నుంచి వచ్చిన 200 లీటర్ల ఆవుపాలకు వచ్చే వెన్న శాతానికి బదులుగా బర్రె పాల వెన్న శాతాన్ని లెక్కించి సెంటర్‌లో చెల్లించారు. అంటే ఉదయం 200 లీటర్లు, రాత్రి 200 లీటర్ల చొప్పున తీసుకుంటే ప్రతి రోజూ 400 లీటర్లను ఆవుపాలకు బదులుగా బర్రెపాలుగా మార్చారు. ఆవు పాలకు ఉదయం 200 లీటర్లకు ఒక లీటర్‌కు రూ.38 ప్రకారం నెలకు 6వేల లీటర్లకు నెలకు రూ.2,28,000, రాత్రిపూట 200 లీటర్లకు ఒక లీటర్‌కు రూ.36 చొప్పున నెలకు 6వేల లీటర్లకు రూ.2,16,000 చెల్లించాలి. కానీ చిల్లింగ్ సెంటర్ నిర్వాహకులు ఆవుపాలకు బదులుగా బర్రెపాలకు ఇచ్చే ధరను లెక్కించారు. అంటే రోజు ఉదయం పూటకు 200 చొప్పున నెలకు 6వేల లీటర్లకు ఒక లీటర్‌కు రూ.57 చొప్పున రూ.3,42,000, రాత్రి పాలు 6వేల లీటర్లకు ఒక లీటర్‌కు రూ. 52 చొప్పున రూ.3,12,000 కానున్నాయి. అయితే ఉదయం పూట 6వేల లీటర్ల పాలకు రూ.1,14,000, రాత్రి పూట పాలకు రూ.96వేలను మేనేజర్ కాజేశాడు. ఈ తతంగం అంతా సుమారు నాలుగు నెలలకు పైగా సాగిస్తున్నట్లు తెలుస్తుంది. మదర్ డెయిరీ మిల్క్ చిల్లింగ్ సెంటర్‌లో అవినీతి జరుగడానికి ముఖ్య కారణం ఇదే. ఆవుపాలకు బదులుగా బర్రెపాలు చూపించిన పాల సెంటర్ చైర్‌పర్సన్‌గా భార్య, చిల్లింగ్ సెంటర్‌లో ఫీల్డ్ సూపర్‌వైజర్‌గా భర్త పని చేయడంతో ఆవుపాలకు బదులుగా బర్రెపాలు చూపించడం సులువుగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు.

అక్రమాలు జరిగాయిలా...

భువనగిరి మదర్ డెయిరీ మిల్క్ చిల్లింగ్ సెంటర్‌కు సమీపంలోని గ్రామాల పాడి రైతులు పాలను తీసుకొస్తారు. పాల సేకరణలో భాగంగా మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పరిధి ఎంబావి పాల సెంటర్ నుంచి ఉదయం 200 లీటర్లు, రాత్రి 200 లీటర్ల ఆవు పాలను తీసుకొచ్చే వారు. కానీ ఆవు పాలలో వచ్చే వెన్న శాతానికి బదులు బర్రె పాలకు వచ్చే వెన్న శాతంగా లెక్కలు రాసి గుట్టుచప్పుడు కాకుండా మేనేజర్ ప్రతి నెలా అదనంగా ఆదాయాన్ని సమకూర్చుకున్నాడు. ఈ క్రమంలో నార్ముల్ మదర్ డెయిరీ చైర్మన్ గుత్తా మధుసూదన్‌రెడ్డి ఈ నెల 20వ తేది రాత్రి భువనగిరి చిల్లింగ్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేయగా అక్రమాలు బయటపడ్డాయి. ఈ విషయంపై విచారణ చేపట్టగా అక్రమాలు జరిగినట్టు నిర్ధారణ కావడంతో ఆరుగురిపై ఈ నెల 24న సస్పెన్షన్ ఆర్డర్ జారీ చేశారు.

సస్పెండైన మేనేజర్, మరో ఐదుగురు సిబ్బంది

ఆవుపాలకు బదులు బర్రెపాల వెన్నశాతాన్ని పెట్టి నెలకు రూ.2లక్షలు కాజేసి తలా పిడికెడు పంచుకున్న పాపంలో మిల్క్ చిల్లింగ్ సెంటర్ మేనేజర్‌తోపాటు మరో ఐదుగురు సిబ్బందిని మదర్ డెయిరీ చైర్మన్ సస్పెండ్ చేశారు. ఈ అక్రమాల్లో భువనగిరి మిల్క్ చిల్లింగ్ సెంటర్ మేనేజర్, ప్రాసెసింగ్ సూపర్‌వైజర్, ల్యాబ్ అసిస్టెంట్, ఇద్దరు ఫీల్డ్ సూపర్‌వైజర్లు, ఒక ఆపరేటర్‌తో మొత్తం ఆరుగురిని సస్పెండ్ చేశారు. ఇందులో వచ్చిన డబ్బులో 60శాతం మేనేజర్‌కు, 40 శాతం డబ్బును మిగతా సిబ్బందికి చేరినట్లు సమాచారం.

సమ్మె బాటలో ఎంజీయూ కాంట్రాక్టు అధ్యాపకులు!

ఉద్యోగాలను రెగ్యులర్ చేస్తామని రేవంత్‌రెడ్డి హామీ

- ఏడాదైనా అమలు కానీ ఎన్నికల మ్యానిఫెస్టో
- ప్రభుత్వం స్పందించకుంటే దశలవారీగా నిరసనలకు రంగం సిద్ధం
- ఇప్పటికే నిరసన దీక్షలో సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు, మోడల్ స్కూల్ టీచర్లు
- వర్సిటీ ఉద్యోగులు సమ్మెకు దిగితే విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం

రామగిరి, డిసెంబర్ 26 : యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేస్తామని, సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం కల్పిస్తామని గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ పొందుపర్చారు. కానీ అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలుకు నోచుకోవడం లేదు. మూడు నెలల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. దాంతో మహాత్మా గాంధీ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఇచ్చిన హామీ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే దశలవారీగా నిరసనలు చేపడుతామని స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని విద్యా శాఖ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు ఒకవైపు, మరోవైపు మోడల్ స్కూల్ టీచర్లు నిరసన దీక్షలు చేపడుతున్న విషయం తెలిసిందే.

ప్రజాభవన్ సాక్షిగా చెప్పినా అంతే?

ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ రాష్ట్రంలోని అన్ని వర్సిటీలోని కాంట్రాక్టు అధ్యాపకులు దాదాపు 350 మందిపైగా ఈ ఏడాది సెప్టెంబర్ 13న ప్రగతి భవన్‌కు వెళ్లారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. దీంతో ఆయన విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, అధ్యాపకులతో చర్చలు జరిపి త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కానీ నాలుగు నెలలు కావస్తున్నా అది కూడా కార్యరూపం దాల్చలేదు. దాంతో ప్రభుత్వ తీరుపై కాంట్రాక్టు అధ్యాపకులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డిని కలిసి సమ్మె నోటీసు అందించేందుకు సమాయత్తమవుతన్నట్లు సమాచారం.

రెగ్యులర్ అధ్యాపకులు లేక న్యాక్‌లో ఎంజీయూకు కోత..!

యూజీసీ నిబంధనల మేరకు ఎంజీయూలో రెగ్యులర్ అధ్యాపకులు లేరు. దీంతో న్యాక్ గుర్తింపులో వర్సిటీ ఉన్నతమైన గ్రేడ్ కోల్పోవాల్సి వస్తున్నది. న్యాక్ హోదా ప్రకారమే ఎంజీయూకు కేంద్ర సంస్థల నుంచి నిధులు అందుతాయి. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సమస్య పరిష్కరిస్తే యూనివర్సిటీ ముందుకు సాగుతుంది.

సమ్మెకు వెళ్తే బోధనకు బ్రేక్!

ఎంజీయూ ఆర్ట్స్, సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్ కళాశాలలోని 21 డిపార్టుమెంట్లలో 32మంది మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులు ఉన్నారు. మిగిలిన 51మంది కాంట్రాక్టు అధ్యాపకులే బోధన సాగిస్తున్నారు. ఇంజినీరింగ్ కళాశాలలో ఎక్కువ భాగం కాంట్రాక్టు అధ్యాపకులే ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమవుతుండటంతో ఎంజీయూలోనూ బోధన పూర్తిగా స్తంభించే అవకాశాలు ఉన్నాయి.

వర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకులే ఎక్కువ

రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో రెగ్యులర్ ప్రొఫెసర్స్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ఎంత మంది పనిచేస్తున్నారనే విషయం వేళ్లమీద లెక్కించవచ్చు. వర్సిటీలో విద్యా బోధన దాదాపుగా ఆయా వర్సిటీల్లో పనిచేస్తున్న 1,456 కాంట్రాక్టు అధ్యాపకులతోనే సాగుతుందనేది వాస్తవం. కొన్ని వర్సిటీల్లో డిపార్టుమెంట్స్ పూర్తి కాంట్రాక్టు అధ్యాపకులతోనే నడుస్తున్నది. మరో వైపు పరిపాలనా విభాగంలో సైతం ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులే సింహ భాగంలో ఉన్నారు.

సీఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే యూనివర్సిటీలోని కాంట్రాక్టు అధ్యాపకులను శాశ్వత అధ్యాపకులుగా గుర్తిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత గత సెప్టెంబర్‌లో ప్రగతి భవన్‌కు వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం కూడా అందజేశాం. దీనిని సత్వరమే పరిష్కరిస్తామని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి కూడా ఆదేశిలిచ్చినట్లు సీఎం చెప్పారు. కానీ ఇంత వరకూ ఎలాంటి నిర్ణయం ప్రభుత్వం చేయకపోవడం బాధాకరంగా ఉంది. రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా బోధన చేస్తున్న తమ సమస్యలు పరిష్కరించి మా కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరుతున్నా.

-ఎన్.భిక్షమయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్(సి), డిపార్టుమెంట్ ఆఫ్ ఫిజిక్స్, ఎంజీయూ

సమాన పనికి సమాన వేతనం అందించాలి

విద్యార్థుల శ్రేయస్సు కోసం రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా బోధన చేస్తున్నాం. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించడం లేదు. ఎంజీయూ ఇంజినీరింగ్ కళాశాలలో అన్ని విభాగాల్లో అధిక సంఖ్యలో కాంట్రాక్టు అధ్యాపకులే ఉన్నారు. ఇంత వరకు మాకు 7వ పీఆర్సీ అమలు చేయలేదు. ఉద్యోగ భద్రత లేదు. భవిష్యత్ తరాలకు అవసరమై టెక్నాలజీ విద్యార్థులను సమాజానికి అందిస్తున్నా మా జీవితాలు మారడం లేదు. తమ న్యాయమైన సమస్యలపై ప్రభుత్వం ఆలోచింది ఉద్యోగ భద్రత కల్పించాలి.

- జ్యోతిరాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్(సి), డిపార్టుమెంట్ ఆఫ్ సీఎస్ఈ, ఎంజీయూ ఇంజినీరింగ్ కళాశాల

పీఆర్‌సీ అమలు చేయాలి

భావిభారత పౌరులను తీర్చిదిద్దే ఉన్నత విద్యానిలయాలు యూనివర్సిటీలు. రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా నిత్యం విద్యార్థులకు అందుబాటులో ఉండి ఏండ్ల తరబడి బోధన సాగిస్తున్నాం. తమ సమస్యలను ప్రభుత్వం అర్థం చేసుకొని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పీఆర్‌సీ అమలు చేయాలి.

-రామచంద్రు, అసిస్టెంట్ ప్రొఫెసర్(సి), డిపార్టుమెంట్ ఆఫ్ మ్యాథ్స్, ఎంజీయూ